TGTEL/25/A1132

మానవాళికి
# జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

మేడ్చల్ | బుధవారం | 15.07.2026 | సంపుటి : 2 | సంచిక : 14 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్

ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు


'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

# ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభించండి

## ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు ఇవ్వండి

ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు ఇవ్వండి

రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అటవీశాఖ అనుమతులు ఇప్పించండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర కేబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో రేవంత్ భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు.

న్యూఢిల్లీ, జూలై 14 : ఆర్ఆర్ఆర్ రెండు వైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల

-మిగతా 2 లో..

## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాలు నిర్మించండి

ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..

కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం

ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం 02

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సిఎం రేవంత్ రెడ్డి



03

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

నేడు శంకుస్థాపన చేయనున్న సిఎం రేవంత్ రెడ్డి

దివిటిపల్లిలో అమర్ రాజా బ్యాటరీ సెంటర్ ప్రారంభోత్సవం


03

## మరోసారి ఏసీబీ సోదాల కలకలం

హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు

ఆదాయానికి మించి ఆస్తులు, బంగారం డబ్బు గుర్తింపు

## సింగరేణి నష్టాలకు బీఆర్ఎస్, కాంగ్రెస్సే కారణం

కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

సింగరేణి నష్టాల బారిన పడటానికి కారణం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. భూపాలపల్లిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'సింగరేణి కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సంస్థ ప్రస్తుతం కష్టనష్టాల్లో ఉంది. కేసీఆర్ పాలన వల్ల సింగరేణి 15 సంవత్సరాలు వెనుకబడింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదన్నారు.



భూపాలపల్లి, జూలై 14 : దేశంలో ఎక్కడా లేని సమస్యలు సింగరేణిలో ఉన్నాయి. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ఒక్కరోజైనా సింగరేణి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిం చరా?. సింగరేణిని కేసీఆర్ కుటుంబం తమ జేబు సంస్థగా మార్చుకున్నారు. ఇష్టారాజ్యంగా దోపిడీ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తోంది. వాళ్ల తాత జాగీరు అన్నట్లు గత ప్రభుత్వం, తాజా ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయి. బొగ్గు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, బొగ్గు లేకపోతే దేశం ఒక్కరోజు కూడా ముందుకు సాగదు. కేసీఆర్ హయాంలో జెన్‌కోకు రూ. 8,958 కోట్ల అప్పు ఇచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ రెండున్నరేళ్లలో మరో రూ. 26,875 కోట్ల అప్పు చేసింది. అప్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని బెదిరించే ధోరణిలో వ్యవహరిస్తోందని విమర్శించారు. కర్ణాటకకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడిందని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌లో సుమారు 434 మిలియన్ టన్నుల గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, దీనివల్ల సింగరేణికి రూ. 1.20 లక్షల కోట్ల టర్నోవర్ వచ్చే అవకాశముందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో కాంగ్రెస్ మంత్రులే రెండు వర్గాలుగా విడిపోయి వాటాల కోసం గొడవపడ్డారని ఆరోపించారు. యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం కోసం సింగరేణి నుంచి రూ. 500 కోట్లు తీసుకున్నారని, మెస్సీ ఫుట్‌బాల్ కార్యక్రమానికి కూడా సింగరేణి నిధులను వినియోగించారని విమర్శించారు.

## ఊరూరా బీఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

కెసిఆర్ హాయంలోనే కూలిన కాళేశ్వరం

కేంద్ర నిపుణలు సూచనల మేరకు నీటి విడుదల

మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్,జూలై14 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ మ-రోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని

-మిగతా 2 లో..



## ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు

నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష

ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. 02

## నిరంతర విద్యుత్ సరఫరా ధ్యేయంగా ఉప కేంద్రాలు నిర్మిస్తున్నాం

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో ఉప కేంద్రం నిర్మాణం

నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిధులకు స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



మహబూబ్‌నగర్, జూలై 4 : జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశు సంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ. 155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




హైదరాబాద్, జూలై 14 : ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్ఒలకు వెంటనే అందజేసి మీ యొక్క ఆమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్

-మిగతా 2 లో..


03

## తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

సుగంధ ద్రవ్యాలతో ఆలయశుద్ధి నిర్వహణ

## ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

మెట్ట ప ంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



హైదరాబాద్, జూలై 14 : ఈ రోజు నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా,

-మిగతా 2 లో..



# నిరంతర విద్యుత్ సరఫరా ధ్యేయంగా ఉప కేంద్రాలు నిర్మిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధ-ుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా బీఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరఫున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్లను సమర్పించారు. సర్ పక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ పక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.

# విద్యాసంస్థల్లో అగ్నిప్రమాదాల నివారణ చర్యలు

**పాఠశాల యాజమాన్యాలకు భద్రతపై అవగాహన**

**విపత్తు సంసిద్ధతపై తెలియచేసిన అగ్నిమాపక శాఖ**

**హైదరాబాద్, జూలై 14 :** విద్యాసంస్థల్లో అగ్నిమాపక, ప్రాణ భద్రతను మరింత మెరుగుపరిచే నిరంతర ప్రయత్నాల్లో భాగంగా తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు / సివిల్ డిఫెన్స్ శాఖ, బేసిక్ ఎలిమెంట్స్ సంస్థ సహకారంతో హైదరాబాద్లోని రవీంద్రభారతిలో పాఠశాల యాజమాన్యాల కోసం అగ్నిమాపక భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమాన్ని తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు / సివిల్ డిఫెన్స్ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ ప్రారంభించారు. బేసిక్ ఎలిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రసాద్ నిష్టాలా సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలకు చెందిన 500 మందికి పైగా పాఠశాల యజమానులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, సీనియర్ అడ్మినిస్ట్రేటర్లు పాల్గొన్నారు. భలో మాట్లాడిన డైరెక్టర్ జనరల్, అగ్నిమాపక భద్రత అనేది కేవలం చట్టబద్ధమైన నిబంధన మాత్రమే కాదని, ప్రతి చిన్నారిని తమకు అప్పగించిన విద్యాసంస్థలపై ఉన్న నైతిక బాధ్యత అని అన్నారు. పాఠశాల యాజమాన్యాలు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, అగ్నిమాపక రక్షణ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం, మాక్ డ్రిల్స్ నిర్వహించడం, విద్యార్థులు, సిబ్బందిలో నిరంతరం అవగాహన కల్పించడం ద్వారా అగ్నిమాపక భద్రతను పాఠశాల పరిపాలనలో అంతర్భాగంగా మార్చాలని సూచించారు. అంశం తీవ్రతను వివరించేందుకు దేశంలోని పలు పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాల్లో జరిగిన ప్రధాన అగ్నిప్రమాదాల కేసు అధ్యయనాలను డైరెక్టర్ జనరల్ వివరించారు. నిర్లక్ష్యం, సరిపడని అగ్నిమాపక భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితులకు సరైన సంసిద్ధత లేకపోవడం వల్ల చిన్నారుల ప్రాణనష్టం సంభవించిన తీరును ఈ ప్రదర్శన స్పష్టంగా చూపించిందన్నారు. దీంతో ప్రమాదాల నివారణ, ముందస్తు సంసిద్ధత, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ఎంత ముఖ్యమో నొక్కి చెప్పారు. కార్యక్రమంలో పాఠశాలల్లో అగ్నిమాపక భద్రతకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థ, తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం?1999లోని నిబంధనలు, పాఠశాల భద్రతపై గౌరవ సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలు, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వివరించారు. తనిఖీల సమయంలో గుర్తించే సాధారణ అగ్నిమాపక లోపాలు, నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను సురక్షితంగా తరలించే విధానాలు, అగ్నిమాపక రక్షణ వ్యవస్థల నిర్వహణ, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంలో పాఠశాల యాజమాన్యాల బాధ్యతలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థుల వసతి గృహాల్లో జరిగిన ప్రాణాంతక అగ్నిప్రమాదాల నేపథ్యంలో పాఠశాల హాస్టళ్లలో అగ్నిమాపక భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పనిచేసే స్థితిలో ఉండే అగ్నిప్రమాద గుర్తింపు, అలారం వ్యవస్థలు, అడ్డంకులు లేని అత్యవసర నిష్క్రమణ మార్గాలు, సురక్షితమైన విద్యుత్ వ్యవస్థలు, క్రమం తప్పకుండా డ్రిల్స్ నిర్వహించడం, హాస్టల్ విద్యార్థులపై తగిన పర్యవేక్షణ, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు.

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాలు నిర్మించండి

- ఎంఆర్వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్కు అవసరమైన భూ సేకరణచేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ, జూలై 14 :** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్ర యాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమాన యాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉ ఒడడంతో పాటు కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతో వరంగల్కీలకనగరంగాఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలోఎంఆర్వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్హాలింగ్), ఎయిర్కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్పోర్ట్లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ లోనూ ఎంఆర్వో, ఎయిర్కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ÷ుక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలుఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులనుకలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవుపలికారు. విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడాలేనంతత్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్రసృష్టించిందని ఆయన అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరేస్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలావిమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకుసమాధానమిచ్చారు.

## ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభించండి

(మొదటిపేజీ తరువాయి)

అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

**భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు**

**నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష**



**హైదరాబాద్, జూలై 14 :** ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియ-ుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు. గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రజా జీవితంలో ముద్రగడ పాత్ర చిరస్మరణీయం

**ఆయన మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు**

**సంతాపం ప్రకటించిన సిఎం రేవంత్ తదితరులు**

**హైదరాబాద్,జూలై 14 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, లోక్ సభ మాజీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం గారి ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడిగా, లోక్ సభ సభ్యుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడారని కొనియాడారు . మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ముద్రగడ పద్మనాభం పోషించిన పాత్ర చిరస్మరణీయమని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశంలో ఎంతో ప్రభావం చూపించిన విలక్షణ నాయకత్వ లక్షణాలు ఉన్న గొప్ప నాయకులు ముద్రగడ అని అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ తనదైన ముద్ర వేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మరణం పట్ల బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్రావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో ఆయన తనదైన ముద్ర వేసి, కాపు సామాజిక వర్గ హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజలకు సేవలందించిన ఆయన రాజకీయ ప్రస్థానం చిరస్మరణీయమై నదన్నారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, అనుచరులకు తన ప్రగాఢ సాన-ుభూతిని తెలియజేశారు హరీష్రావు. ముద్రగడ్డ పద్మనాభం మరణంపై రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ఆయన మరణ వార్త ఎంతో దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని సంతాపం వ్యక్తం చేశారు.

# ఎల్నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

(మొదటిపేజీ తరువాయి)



గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలుస్టెల్లా మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్టాల్లో్ర కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచిం చారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులు రైతులకు ఎల్నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటల్ల అభివృద్ధి

- ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం
- ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు
- భద్రాద్రిని కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష



**హైదరాబాద్, జూలై 14 :** భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఈ రెండున్నర సంవత్సరాల్లో జిల్లాలోని ప్రభుత్వ దవాఖాన్లలో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యాయన్నారు. జిల్లాలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని, హాస్పిటళ్లలో అన్నిరకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ అవేర్‌నెస్ కార్యక్రమాలు కూడా చేపడుతోందన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 దయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు.

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

**నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**దివిటిపల్లిలో అమర్ రాజా బ్యాటరీ సెంటర్ ప్రారంభోత్సవం**



**హైదరాబాద్,జూలై14 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ భూమిపూజ చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా సెల్ తయా రీ యూనిట్‌ను ప్రారంభించను న్నారు. అలాగే వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. 12:15 గంటలకు ఫ్యూచర్ సిటీలోని అమెజాన్ డేటా సెంటర్ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:15 నుంచి 12:45 గంటల మధ్య అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం 12:50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి పయనమవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు దివిటిపల్లి చేరుకుని, 1:20 నుంచి 2:20 గంటల మధ్య అమ-రరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, అనంతరం ప్రసంగం చేయనున్నారు. ధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు హెలికాప్టర్‌లో సీఎం రేవంత్ బయలుదేరుతారు. మధ్యాహ్నం 2:40 గంటలకు కొత్తకోటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల మధ్య బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 3:45 గంటలకు కొత్తకోట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.





## కేపీహెచ్‌బీ లులూ మాల్ వద్ద ఘర్షణ

- గన్‌తో వ్యక్తి హల్‌చల్ చేయడంతో ఆందోళన
- మాల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్, జూలై 14 :** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లులు మాల్‌లో ఓ వ్యక్తి గన్‌తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెబుతుండగా పాతబస్తీకి చెందిన సిద్దిఖీ అనే వ్యక్తి జేబులో గన్‌ను పోలీసులు గుర్తించారు. సిద్దిఖీ దగ్గర గన్ కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కాగా గన్‌కు చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. అయితే గన్‌తో వచ్చిన వ్యక్తిని మాల్‌లోకి అనుమతించడంలో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మాల్‌లోకి ప్రవేశించేప్పుడు సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే సదరు వ్యక్తి గన్‌తో లోపలికి రాగలిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. మాల్ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే గన్‌తో సదరు వ్యక్తి లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా మాల్స్‌లో మెటల్ డిటెక్టర్లు, బ్యాగ్ స్కానింగ్ వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. కానీ ఈ ఘటనలో భద్రతపరంగా నిర్లక్ష్యం జరిగింది. నేపథ్యంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నందుకు లులు మాల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు సూచించారు. ఈ ఘటన నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో భద్రతా ఏర్పాట్లపై మరోసారి చర్చకు దారి తీసింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని మాల్స్‌లో భద్రతా తనిఖీలను ఖచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## రక్తపు భాష ఆగకపోతే రాష్ట్రంలో రక్తపాతం జరిగే ప్రమాదం ఉంది

- రక్తం చిందిస్తే వానలు పడతాయన్న వ్యాఖ్యలు బాధాకరం
- సిఎం రేవంత్ రెడ్డిపై వెంటనే కేసు పెట్టాలి
- డీజీపీని కోరిన బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్, జూలై 14 :** రక్తం చిందిస్తే వానలు బాగా వస్తాయని, పంటలు పండుతాయని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. ఆయనపై వెంటనే కేసు నమోదు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. మన పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఏమాత్రం ప్రొఫెషనలిజం మిగిలి ఉన్నా వెంటనే స-ుమోటోగా స్వీకరించి, రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయమని పోలీసులకు ఆదేశించాలని కోరారు. పరిస్థితి చేయి దాటకముందే నివారించాలని విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేయడంపై చట్టంలో ఎక్కడా ముఖ్యమంత్రికి మినహాయింపు ఇవ్వలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రిని అరెస్టు చేయాలంటే కేవలం అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రమే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది రాజకీయ కక్షతో చేస్తున్న ఆరోపణ కానే కాదని స్పష్టం చేశారు. రక్తం చిందిస్తే వానలు బాగా వస్తాయి, పంటలు బాగా పండుతాయని ఏకంగా సీఎం సలహా ఇచ్చారని, ఎవరైనా ఆగంతకుడు పంట పొలాల్లో నిద్రిస్తున్న అమాయక రైతులను చంపి షాబాద్ రాజ్‌కుమార్‌లా వీడియోలు తీస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావుపై ఎవరైా, మిగతా అగ్ర నాయకులపై ఆగంతుకులు చేస్తే పరిస్థితి ఏంటని అడిగారు. ముఖ్యమంత్రే బెల్ట్‌తో కొట్టమన్నారని చెప్పి.. భర్తలు తాగొచ్చి భార్యాపిల్లలను బెల్ట్‌లతో కొడితే, కింది ఉద్యోగులను పై అధికారులు బెల్ట్‌తో కొడితే పరిస్తఇతి ఏంటని ప్రశ్నించారు.దీనిపై ఒకసారి కూల్‌గా ఆలోచించాలని సూచించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకుల మీద పెట్రోల్ పోసి, తాను కూడా పోసుకుంటానని గతంలో గజ్వేల్‌లో నిర్వహించిన ఓ బహిరంగ సభలో కార్యకర్తలను మైనంపల్లి హన్మంతరావు ప్రేరేపించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కనీసం ఆయన మీద కూడా కేసు నమోదు చేయకుండా, పీపీ ఒపీనియన్ తీసుకుని ఇది సివిల్ కేసు అని నాటి సిద్దిపేట పోలీస్ కమిషనర్ చెప్పారని గుర్తుచేశారు. దీన్ని ప్రజలు మరిచిపోయారని అన్నారు. సంగారెడ్డిలో శౌర్య పతాక విజేత ఇన్‌స్పెక్టర్ శివకుమార్ యాదవ్ అంతు చూస్తానన్న జగ్గారెడ్డికి కనీసం నోటీసులు అయినా ఇచ్చారా అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. పోస్టింగ్‌లు ఇవాళ ఉంటాయి.. రేపు పోతాయి.. కానీ పోలీసు వ్యవస్థ శాశ్వతమని తెలిపారు. పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠ గురించి, ప్రజలకు జీవించే హక్కు (ఆర్టికల్ 21) గురించి ఆలోచించాలని డీజీపీకి సూచించారు. మంచి పనులు చేస్తే చరిత్రలో మిగిలిపోతారని, రాజ్యాంగంలోని 311 అధికరణం మిమ్మల్ని కాపాడుతుందని తెలిపారు. అందుకే దయచేసి బీఎస్ఎస్ సెక్షన్ 45ని మళ్లీ చదవాలని కోరారు. దానిపై లీగల్ ఒపీనియన్ తీసుకుని, ముఖ్యమంత్రికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఆయన వివరణతో సంతృప్తి చెందకపోతే కేసు నమోదు చేయాలన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డీజీపీకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు. నేరం జరుగుతున్నప్పుడు చూస్తూ ఉన్న ప్రతి ఒక్కరూ నేరస్తులే అని స్పష్టం చేశారు. ఈ రక్తపు భాష ఆగకపోతే రాష్ట్రంలో రక్తపాతం జరిగే ప్రమాదం ఉందని, వేలాది మంది అమాయకులు బలైపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

## మరోసారి ఏసీబీ సోదాల కలకలం

**హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు**

**ఆదాయానికి మించి ఆస్తులు, బంగారం డబ్బు గుర్తింపు**



**హైదరాబాద్,జూలై 14 :** హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ సోదాల కలకలం రేగింది. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ ఇల్లు, కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి సోదాలు కొనసాగాయి. బచ్చు రవీందర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయిన నేపథ్యంలో ఏసీబీ దాడులు నిర్వహి స్తోంది. అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్టు చీఫ్ ఇంజినీర్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏకకాలంలో 12 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలకు దిగారు. ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగాయి. ఇప్పటికే రవీందర్ నివాసంలో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకు న్నట్లు తెలుస్తోంది. ఆస్తుల పత్రాలతోపాటు, వివిధ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను అధికారులు గుర్తించారు. రవీందర్ నివాసంలో బ్యాంకు లాకర్లను గుర్తించినట్లు సమాచారం. ఈరోజు సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయని తెలుస్తోంది. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు ముగిశాయని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు. ఈ సోదాల్లో అతని వద్ద ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు భారీగా గుర్తించినట్లు తెలిపారు. సోదాల అనంతరం ఆయన మాట్లాడారు. సుమధుర అక్రోపోలిస్‌లో 3 ప్లాట్, శ్రీవారి మెడోస్‌లో మరో ప్లాట్ ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వాసవి అట్లాంటిస్‌లో ఏకంగా మూడు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు కనుగొన్నామని చెప్పారు. మసీద్ బండలో నాలుగు అంతస్తుల భారీ భవనం, జడ్చర్లలో 7 ప్లాట్లు, కొండాపూర్‌లో రెండు ప్లాట్లు ఉన్నాయని వివరించారు. శంషాబాద్, షాబాద్ పరిధిలో 4 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు తమకు ఆధారాలు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సోదాల్లో అర కిలో బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ సీజ్ చేశామని అన్నారు. అలాగే బచ్చు రవీందర్ పేరిట ఉన్న 4 బ్యాంక్ లాకర్లను గుర్తించి.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆస్తులతో పాటు ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన 18 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు.

## బాబా అవతారంలో హంతక్ రౌడీషీటర్

**వలపన్ని పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్, జూలై 14 :** హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు బాబా అవతారం ఎత్తిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మహ్మద్ జావేద్ అనే వ్యక్తి 2018లో జరిగిన మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని రౌడీషీటర్ హత్య చేశాడు. ఆపై పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు.. 2020 ఆగస్టులో జావేద్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. అప్పటి నుంచి జావేద్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, పోలీసుల కళ్లుగప్పి సంగారెడ్డి జిల్లా చేర్యాలలో బాబా అవతారం ఎత్తాడు రౌడీ షీటర్. ఓ దర్గాలో బాబాగా రౌడీషీటర్ చలామణి అవుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని చాకచక్యంగా జావేద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆపై అతడికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. గంజా సేవించినట్లు నిర్ధారించారు. మరోవైపు రౌడీషీటర్ వద్ద భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అనంతరం మహ్మద్ జావేద్‌ను సైఫాబాద్ పోలీసులకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు.

## సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

**హోం టూర్ వీడియోల హల్ చల్**

**ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం : మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, జూలై 14 :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మభ్య పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

## ఇంధన భద్రత లక్ష్యంగా జైశంకర్ గల్ఫ్ పర్యటన

**వివరాలు వెల్లడించిన విదేశాంగ శాఖ**

**న్యూఢిల్లీ, జూలై 14 :** భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల గల్ఫ్ ప్రాంతంలోని నాలుగు దేశాలలో జరిపిన పర్యటనలో 'ఇంధన భద్రత' అత్యంత కీలకమైన అంశంగా నిలిచిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో పాటు పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై కూడా విస్తృత చర్చలు జరిగాయని పేర్కొంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన వారంతపు మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ పర్యటనలకు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. ఈ నెల ప్రారంభంలో విదేశాంగ మంత్రి ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఒమన్ దేశాలలో పర్యటించి, ఆయా దేశాల అగ్రనాయకత్వంతో, తన సహచర మంత్రులతో విస్తృతస్థాయి చర్చలు జరిపారని వెల్లడించారు. భారతదేశ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలకమైన చమురు, గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవడానికి, అంటే 'ఇంధన భద్రత'ను కాపాడుకోవడానికి ఈ పర్యటన ఎంతగానో దోహదపడుతుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

## తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్ నియామకం

**హైదరాబాద్,జూలై 14 :** ప్రతిష్టాత్మక తెలంగాణ తెలుగు అకాడమి నూతన డైరెక్టర్‌గా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాషా పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భూమిక పోషించే తెలుగు అకాడమి సారధ్య బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్ కు అప్పగించడం పట్ల పలువురు విద్యావేత్తలు ఆచార్యులు పరిశోధకులు గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య భట్టు రమేష్ కు ఉన్నత విద్యారంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధనానుభవం ఉంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అత్యుత్తమ సేవలందించారు. వీటితో పాటు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతిగా, గిరిజన అధ్యయన శాఖ అధిపతిగా, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**హైదరాబాద్,జూలై14 :** 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.



## తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**సుగంధ ద్రవ్యాలతో ఆలయశుద్ధి నిర్వహణ**

**తిరుమల,జూలై14 :** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. 17న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను తితిదే రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తితిదే జేఈవో డాక్టర్ ఏ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో లోకనాథం, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రహసనంగా మారిన సర్ ప్రక్రియ!



**ఆధార్ సక్రమంగానే ఉంటోంది. పాన్ కార్డు సక్రమంగానే ఉంటోంది. గ్యాస్ కనెక్షన్ కూడా పక్కాగా ఉంటోంది. బ్యాంక్ అకౌంట్ కూడా పక్కాగానే ఉంటోంది. ఇంటినంబర్లు, చెల్లింపులు ఇలా చెప్పకుంటూ పోతే అన్నీ పక్కాగా ఉంటున్నా..ఓటు మాత్రం పక్కాగా ఉండడం లేదు. ఎఐని అడిగితే ఎలా పక్కాగా చేయవచ్చో చెబుతుంది. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తే పక్కాగా ఓటరు కార్డు వస్తుంది. కానీ ఎన్నికల సంఘం, కేంద్రానికి ఇవేమీ పట్టడం లేదు. పర్మినెంట్ ఓటరు కార్డు నంబర్ ఉంటే ఓటు కోసం గందరగోళం పడాల్సిన అవసరం లేదు. ప్రజలు ఎవరికి వారు తమ ఓటును పక్కాగా ఉంచుకుంటారు. ఎవరైనా అడ్రస్ మారితే మార్చకుంటారు. ఆధార్ విషయంలో ఇదే జరుగుతోంది. కానీ ఘనత వహించిన ఎన్నికల సంఘం మాత్ర దీనిని ఓ మాయగా తయారు చేసింది. చదువుకున్న వారికి సైతం అర్థం కాని ప్రక్రియగా చేశారు. టెక్నాలజీ ఇంతగా పెరిగినా ఉపయోగించుకోవడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలం అయ్యిందని చెప్పాలి.**

తాజాగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారంది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ పక్రియ తీరు క్షేత్రస్థాయిలో ఘోరంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అందరికీ ఎన్యుమరేషన్ ఫామ్‌లు పంచేసి రికార్డు సృష్టించామని అధికారులు చెప్తున్న లెకలకు, క్షేత్రస్థాయిలో ఓటర్లు ఎదురొంటున్న వాస్తవ పరిస్థితులకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ దాదాపు వందశాతం పూర్తయినట్టు రికార్డుల్లో చూపిస్తున్న ప్రాంతాల్లో కూడా కనీసం బూత్ లెవల్ అధికారులు అంటే బీఎల్‌వోలు అడుగుపెట్టలేదని ఓటర్లు చెబుతున్నారు. కొందరైతే వారెలా ఉంటారో కూడా చూసి ఉండలేదంటున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 99.98 శాతం మందికి ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ పూర్తయింది. 26 జిల్లాల్లో ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేశామని అధికారులు కాగితాల్లో లెకలు చూపిస్తున్నారు. ఉన్నతాధికారుల సమీక్షల్లో శభాష్ అనిపించుకోవడానికి క్షేత్రస్థాయి సిబ్బంది చూపించిన ఈ అంకెల గారడీ ఇప్పుడు ఓటర్ల పాలిట శాపంగా మారింది. అధికారులు వంద శాతం పంపిణీ అని చెప్తుంటే.. నగర, పట్టణ ప్రాంతాల ఓటర్లు మాత్రం 'మా కాలనీ, మా ఇండ్లకు అసలు బీఎల్‌వోలు వచ్చిన దాఖలాలే లేవు. మాకు అందాల్సిన ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఎటు పోయాయని ప్రశ్నిస్తున్నారు. దీని బదులు ఏ మీసేవా సెంటర్‌లో పెట్టినా హాయిగా వెళ్లి సవరణలు చేసుకునే వారమని అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపకల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, శివారు కాలనీల్లో చాలామందికి ఫామ్‌లు అందనే లేదు. అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరించకుండానే, ఆఫీసుల్లో కూర్చొని ఫామ్‌ల పంపిణీ అయిపోయినట్టు టిక్ మార్కులు పెట్టేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీత గడువులోగా పక్రియ పూర్తి చేయాలనే పైఅధికారుల ఒత్తిడికి భయపడి క్షేత్రస్థాయి సిబ్బంది తూతూమంత్రంగా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

సర్ నిబంధనల ప్రకారం బీఎల్‌ఓలు మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలన్న నియమం ఉన్నా కనీసం ఒక్కసారి కూడా క నిపించ కుండానే పోతున్నారు. నగరాలు, పట్టణాల్లో ని అనేక కాలనీల్లో బిఎల్‌వోలు సంద ర్శించిన ప్రాంతాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెప్పు కుంటోది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్‌ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇపూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్‌ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ పక్రియ దరిద్రంగా సాగుతోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. గతంలో బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ప్రజలు గగ్గోలు పెడుతుంటే ..ఇక్కడ ఉన్నవారికి అదో వింతగా అనిపించింది. కానీ ఇప్పుడు మనకు అనుభం కావడంతో అసలు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే సాగితే తెలుగు రాష్ట్రాల్లో కనీసం 50 శాతం ఓట్లు గల్లంతు కావడం ఖాయం. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదు. అలాగే తొలగించడం కూడా సరికాదు. ఆధార్ కార్డును ఓటరుగా గుర్తిం చేందుకు ఉపయోగ పడదని ఇప్పటికే ఇసి తేల్చి చెప్పింది. ఆధార్ కార్డు ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో అర్థం చేసుకోవాలి. నిజానికి ఓటు నమోదు, తొలగింపే ఓ ప్రహసనంగా మారడం విడ్డూరంగా ఉంది. పక్కాగా ఓటరు కార్డును త యారు చేయలేని దౌర్భాగ్యస్థితిలో ఎన్నికల సంఘం ఉంది. సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందివుంటే ..దానిని గుర్తించి ఏరివేయాలి.

ఓటరు జాబితాలోచనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయంటే అందుకు ఎన్నికల సంఘం సక్రమ నిర్వహా లోపమే కారణం. సరైన టెక్నాలజీని వాడడం లేదు. ఎన్నో ఐటి కంపెనీలు ఉన్నాయి. వారికి అప్పగిస్తే ఎలా ఓటు నమోదు చేయాలో, దానికి ఎలా పర్మినెంట్ నంబర్ ఉండాలో చెబుతారు. బిఎల్‌వోలు ఇంటింటికీ తిరగకుండా గ్రామస్థాయిలో పంచాయితీల సహకారం తీసుకోవాలి. పట్టణాల్లో వార్డుస్థాయి అధికారుల సహాయం తీసుకుంటే బాగుండేది. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఈ తంతు మొత్తం తలనొప్పిగా ఉందే తప్ప సజావుగా ఓటను పదిలపర్చుకునేలా లేదు. ఇలాంటి తలనొప్పులను అధికారులు గుర్తించడం లేదు. అది ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం.

# సరిహద్దుల్లో అమెరికాన్ మాజీ సోల్జర్ అరెస్ట్

- అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పట్టివేత
- పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అనుమానాలు



**న్యూఢిల్లీ, జూలై 14 :** భారత్–నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. అమెరికా డ్రోన్ నిపుణుడు మాథ్యూ వాన్‌డైక్‌ను ఇటీవల మణిపూర్‌లోభారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది. అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా.. స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు. విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమిగ్రేషన్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు. అనంతరం టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని.. అక్కడ పాస్–పోర్టు పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ. వాన్‌డైక్ అరెస్టు ఒక కొత్త ధోరణిని సూచిస్తోంది. విదేశీ కిరాయి సైనికులు భారత భూభాగం గుండా ఇతరులకు ఆయుధాలు, డ్రోన్ల బట్వాడాకు నడుంకట్టారు. వారు భారత్‌ను కీలకమైన రవాణా మార్గంగా వాడుకోవాలని చూస్తున్నారు. వాన్‌డైక్ 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు. లిబియా అంతర్యుద్ధ సమయంలో గడాఫీకి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా వార్తల్లోకి వచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో పర్యటించాడు. సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు. 2022 మార్చి నుంచి అతని సంస్థ ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.

# ఎండల తీవ్రతకు పెరిగిన విద్యుత్ డిమాండ్

## హైదరాబాద్‌లోఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి



**హైదరాబాద్, జూలై 14 :** ఎండల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా నమోదవుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో ఏసీలు, కూలర్ల వాడకం పెరిగిందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూలై రెండు వారాల్లో రోజువారీ విద్యుత్ వినియోగం 61–71 మిలియన్ల యూనిట్ల ఉండగా, ఈ ఏడాది జూలై 11 తేది నాటికి 71–82 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవు తోంది. నగరంలో సాధారణం కంటే 4–5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2–3 డిగ్రీలు పెరిగే అవకాశాలుంటాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో సోమవారం గరిష్ఠంగా 36.7 డిగ్రీలు, కనిష్ఠం – 25.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భానుడి భగ.. భగలకు నగరవాసులు అల్లాడిపోతున్నారు. వర్షాకాలం లోనూ వేసవి తరహాలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 1 నుంచి జూలై 13 వరకు హైదరాబాద్ జిల్లాలో సాధారణంగా 175 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 100.1 మిల్లిమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 43 శాతం తక్కువని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో సాధారణం కంటే 26 శాతం, మేడ్చల్– మల్కాజిగిరిలో 54 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 28 తక్కువ వర్షపాతం ఈ సీజన్‌లో నమోదైంది.మరో వారం రోజులు భారీ వర్ష సూచనలు కన్పించడం లేదని బేగంపేట సీనియర్ వాతావరణశాఖ అధికారి జీఎన్ఆర్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం సాధారణం కంటే 3–4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నగరంలో నమోదవుతున్నాయి. మరో 2–3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది.

# బద్రీనాథ్ ఆలయ విరాళాల లెక్కింపులో అక్రమాలు

## సస్పెండ్ అయిన అధికారి ప్రమోద్ నౌటియాల్ అరెస్ట్

**న్యూఢిల్లీ, జూలై 14 :** బద్రీనాథ్ ఆలయ విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో ఉత్తరాఖండ్ పోలీసులు బద్రీనాథ్ – కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ చైర్మన్ మాజీ వ్యక్తిగత సహాయకుడు , సస్పెండ్ అయిన అధికారి ప్రమోద్ నౌటియాల్‌ను అరెస్ట్ చేశారు. డెహ్రాడూన్‌లోని అతడి నివాసంలో చమోలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం అతడిని బద్రీనాథ్‌కు తరలించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి పోలీసు కస్టడీ కోరనున్నట్లు అధికారులు తెలిపారు. జులై 2వ తేదీన ఆలయ కానుకల లెక్కింపు సమయంలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారణ ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలనలో ప్రమోద్ నౌటియాల్ నగదు లెక్కింపు గది నుంచి తన వ్యక్తిగత కార్యాలయానికి పలుమార్లు వెళ్లినట్లు గుర్తించారు. ఈ కేసు విచారణలో రూ.500, రూ.100 నోట్ల కట్టలు, బంగారు, వెండి నాణెలిలు, శాలిగ్రామ శిలలను దాచిపెట్టినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. ఆలయ విరాళాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను, పద్ధతులను పూర్తిగా ఉల్లంఘించినట్లు ఃఐ÷ుఅ అంతర్గత నివేదికలో కూడా ప్రాథమికంగా పేర్కొంది. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ క్రమంలోనే గర్వాల్ డివిజనల్ కమిషనర్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, కేదార్‌నాథ్ ఆలయ నిధుల వినియోగంలోనూ అక్రమాలు వెలుగుచూశాయి. వీఐపీల వసతి, భోజనాల పేరిట నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో మాజీ మేనేజర్, ఇన్‌చార్జ్ అధికారి, మాజీ సీఈఓలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు తన సస్పెన్షన్, ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ ప్రమోద్ నౌటియాల్ ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జులై 16వ తేదీన జరగనుంది.

# పంజాబ్‌లో ప్రైవేట్ స్కూళ్లకు షాక్

## పెంచిన ఫీజులను వాపస్ చేయాలని సర్కార్ హుకుం

**చండీఘడ్, జూలై 14 :** పంజాబ్‌లోని ప్రైవేట్ స్కూళ్లకు అక్కడి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు.. ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ఆ సమాచారాన్ని విద్యాశాఖ పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లించలేదని మానసిక వేధింపుల కారణంగా ఇటీవల అమృత్‌సర్‌లో 17ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనను భగవంత్‌మాన్ ప్రస్తావించారు. ఈ ఘటన తర్వాత, అధిక ఫీజుల పెంపుపై తల్లిదండ్రుల నుంచి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఆర్డినెన్స్‌ను కోర్టులో సవాలు చేసినా తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని.. ఈ విషయంలో వెనకడుగు వేసేదే లేదని స్పష్టం చేశారు. కొత్త ఆర్డినెన్స్ ప్రకారం.. ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5శాతానికి మించి పెంచకూడదు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై రూ.50వేల నుంచి రూ.1 లక్షవరకు జరిమానా విధింపు, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకోనున్నారు. ఈ నిర్ణయం ద్వారా పంజాబ్‌లోని 32లక్షలకు పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయోజనం పొందుతారని అంచనా.

# లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్

## పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ఎన్ఐఏ విచారణ

**శ్రీనగర్, జూలై 14 :** జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి కేసులో లష్కరే తయ్యిబా చీఫ్ హఫీజ్ సయీద్‌పై స్పెషల్ ఎన్ఐఏ కోర్టు నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జులై 8వ తేదీన కోర్టు హఫీజ్ సయీద్‌పై నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేయ గా.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పహల్గాం దాడిపై విచారణ జరుపుతున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) జులై 6న ఈ కేసుకు సంబంధించి స్పెషల్ ఎన్ఐఏ కోర్టులో అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ఎల్ఈటీ అధినేత హఫీజ్ సయీద్‌పై పలు అభి యోగాలతో ఈ అనుబంధ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. సయీద్‌పై ఉపా చట్టంతో పాటు భారతీయ న్యాయసంహితలోని పలు సెక్షన్ల కింద ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. జులై 8వ తేదీన ఎన్ఐఏ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను కోర్టు పరిశీలించింది. ప్రాథమికంగా నిందితుడిపై మోపిన అభియోగాలకు తగిన ఆధారాలు ఉన్నాయని భావించి, కేసును విచారణకు స్వీకరిం చింది. నిందితుడిపై నాన్–బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసిం ది. పాకిస్థాన్‌లో ఉన్న సయీద్ ఇండియాకు రాకపోయినప్పటికీ విచారణ కొనసాగనుంది. 2024లో అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టం 'భారతీయ నాగరిక్ సురక్ష సంహిత– 2023'లోని సెక్షన్ 356 ప్రకారం.. నిందితుడు అందుబాటులో లేకపోయినా అతనిపై విచారణ జరిపి శిక్ష వేయవచ్చు. దీన్నే 'ట్రయల్ ఇన్ అబ్సెన్షియా' అంటారు.

# హర్మూజ్‌లో ట్యాంకర్లపై ఇరాన్ దాడి

## భారతీయుడి మృతి



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఈ ఘర్షణలు తీవ్రరూపం దాల్చి మళ్లీ పూర్తిస్థాయి యుద్ధంగా మారుతుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొన్నిరోజులుగా అమెరికా–ఇరాన్ పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. తాజాగా రెండు యూఏఈ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేయడంతో భారత సిబ్బంది ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఒమన్ తీరం సమీపంలో జరిగిన ఈ దాడిలో మరో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ జాతీయులు కూడా గాయపడ్డారు. ఈ మేరకు యూఏఈ రక్షణశాఖ ప్రకటించింది. ఈ దాడిని యూఏఈ తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని ఆగ్రహం వ్యక్తంచేసింది. దీనికి ప్రతిస్పందించే హక్కు తమకు ఉందని హెచ్చరించింది. తమ సార్వభౌమత్వం, భద్రతను పరిరక్షించుకోవ డానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకొంటామని తేల్చిచెప్పింది. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కోవడానికి, ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే చర్యలకు తగినవిధంగా ప్రతిస్పందించేందుకు యూఏఈ పూర్తి సంసిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. హర్మూజ్‌లో ప్రయాణిస్తున్న నౌకలపై కొన్నిరోజుల క్రితం ఇరాన్ దాడి చేయడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. దాంతో ఇరాన్‌లో అమెరికా దాడులు.. అందుకు ప్రతిగా గల్ఫ్‌లోని అగ్రరాజ్య సైనిక స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేయడంతో హర్మూజ్ జలసంధి మరోసారి ఘర్షణలకు కేంద్రబిందువైంది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. హర్మూజ్‌లో ప్రయాణించే నౌకల నుంచి.. వాటిలోని సరకు విలువలో 20% టోల్ వసూలు చేస్తామని ప్రకటించారు. హర్మూజ్ విషయంలో అమెరికా జోక్యాన్ని సహించబోమని, నౌకల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే బలప్రయోగానికి దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. సోమవారం రాత్రి ఇరాన్ లోని జస్క్, బుషెహర్, కొనారక్, అబు మూసా, బందర్ అబ్బాస్‌లోని లక్ష్యాలపై దాడులు చేశామని అమెరికా మిలిటరీ ప్రకటించింది. దీంతో వాణిజ్యనౌకలపై ఇరాన్ దాడులు చేసే సామర్థ్యం మరింత దెబ్బతిన్నదని వెల్లడించింది. బుషెహర్‌లో అణువిద్యుత్ కేంద్రం ఉంది. రష్యా సహకారంతో ఇది పనిచేస్తోంది. మరోవైపు, యూఏఈ ట్యాంకర్లపై చేసిన దాడులను ఇరాన్ ధ్రువీకరించింది. తమ హెచ్చరికలను పట్టించుకోకపోవడం వల్లే టార్గెట్ చేశామని వెల్లడించింది. అలాగే బహ్రెయిన్‌లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్‌ను లక్ష్యంగా చేసుకున్నామని, ప్రతీకార చర్య కొనసాగుతోందని ప్రకటించింది.



# సౌదీలోని అభా విమానాశ్రయంపై హూతీల దాడి

## భగ్గుమన్న ఉద్రిక్తతలు

**సౌదీ :** అమెరికా – ఇరాన్ ఉద్రిక్తతలు సరిపోవన్నట్లు.. ఇప్పుడు సౌదీ అరేబియా–హూతీల మధ్య మరోసారి ఘర్షణలు చెలరేగాయి. సౌదీలోని అభా అంతర్జాతీయ విమానాశ్రయంపై హూతీ తిరుగుబాటుదారులు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఇరాన్ నుంచి హూతీ ప్రతినిధుల బృందాన్ని తీసుకువస్తున్న విమానాన్ని అడ్డుకునేందుకు సోమవారం సౌదీ మద్దతున్న యెమెన్ ప్రభుత్వం సనా అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేపై బాంబు దాడి చేయడంతో ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగేళ్లుగా సౌదీఅరేబియా, ఇరాన్ మద్దతు ఉన్న హూతీ మధ్య ఉన్న ప్రశాంతతకు ఈ దాడులతో బ్రేకులు పడినట్లయింది. 2022 నుంచి రెండువర్గాలు అనధికారిక కాల్పుల విరమణను పాటిస్తున్నాయి. సౌదీ అరేబియా, యెమెన్‌లో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వం మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అదే సమయంలో ఉత్తర యెమన్‌ను హూతీ రెబెల్స్ నియంత్రిస్తున్నారు. ఈ గ్రూప్‌నకు ఇరాన్ మద్దతు ఉంది. సనా విమానాశ్రయంపై దాడి వెనక సౌదీ అరేబియా ఉందని ఆరోపించిన హూతీలు.. వాటికి బదులుతీర్చుకుంటామని ప్రకటించారు. అన్నట్టే దాడులు చేశారు. తాము ఆ క్షిపణులను అడ్డుకున్నామని సౌదీ వెల్లడించింది. అయితే వాటిలో కొన్ని అభా ఎయిర్‌పోర్ట్‌పై పడటంతో మంటలు చెలరేగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరు : ఎస్ఎఫ్ఐ



**దేవరుప్పుల :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకు ఎస్ఎఫ్ఐ దేవరుప్పుల మండల కార్యదర్శి సంతోష్‌ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటివరకు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరమన్నా రు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాటు ఖాళీగా ఉన్న లెక్చరర్, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ నిధులు విడుదల చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే రాష్ట్రానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



## శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం

### భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**కూకట్‌పల్లి , జూలై 14, (జనం వార్త) :** కుత్బుల్లాపూర్ లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయములో మంగళవారం అమావాస్య సందర్భంగా శ్రీ వాసుదేవా పీఠం అధ్యర్యంలో 108 అష్టోత్తర శత శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ పారాయణ కార్యక్రమంలో స్థానిక భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పారాయణం చేశారు . శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆధ్యాత్మిక చింతన లభిస్తుందని ఆలయ వేద పండితులు భక్తులకు సూచించారు.



## మహిళల భద్రతకు 'సహచరి' అండ

- మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ వినూత్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం ప్రారంభం
- 3 వేల మంది స్వయం సహాయక మహిళలకు చట్టాలు, భద్రతపై అవగాహన

**సికింద్రాబాద్ :** మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు పోలీస్--ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా 'సహచరి' పేరుతో వినూత్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరే ట్, ఎంఈపీఎంఏ , ఎస్ఈఆర్‌పీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మల్కాజిగిరి జోన్ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం బోయిన్‌పల్లిలోని ఇంపీరియల్ గార్డెన్‌లో, ఎల్‌బీనగర్, ఉప్పల్ జోన్ల మహిళల కోసం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని సుమారు మూడు వేల మంది మహిళా సంఘాల సభ్యులు పాల్గొని పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు, మహిళలు--పిల్లల భద్రత, సైబర్ నేరాల నివారణ, షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, పోక్సో, ఎన్‌డీపీఎస్ చట్టాలు తదితర అంశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ, మహిళల భాగస్వామ్యం లేకుండా సమాజ భద్రత సాధ్యం కాదన్నారు. ప్రతి మహిళ తన కాలనీ, బస్తీలో 'కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్'గా వ్యవహరిస్తూ నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. మహిళలు నిర్భయంగా పోలీసులను ఆశ్రయించి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. 'సహచరి' కార్యక్రమం ద్వారా ప్రజలు--పోలీసుల మధ్య విశ్వాసం మరింత పెరిగి, మహిళలు, పిల్లలకు సురక్షితమైన వాతావరణం ఏర్పడుతుందని ఆమె తెలిపారు. ఎంఈపీఎంఏ అదనపు మిషన్ డైరెక్టర్ డా. ఎన్. యాదగిరి రావు మాట్లాడుతూ, ప్రతి నెల జరిగే స్వయం సహాయక మహిళా సంఘాల సమావేశాల్లో భద్రతకు సంబంధించిన అంశాలను చర్చించి, ఈ కార్యక్రమం ద్వారా పొందిన సమాచారాన్ని గ్రామాలు, కాలనీల స్థాయిలో విస్తృతంగా పంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు చి. శ్రీధర్, కె. రాహుల్ రెడ్డి, కె. సురేష్ కుమార్, డా. బి. అనురాధ, టి. ఉషారాణి, ఎ. లక్ష్మి, ఇతర అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పాల్గొన్నారు.

## పంటలకు నీరివ్వాలని రైతుల డిమాండ్

### అమలాపురం నీటిపారుదల శాఖ కార్యాలయం ముట్టడి

**అమలాపురం, జూలై 14 :** పంటలకు తక్షణమే నీరు అందివ్వాలని డిమాండ్ చేస్తూ అమలాపురం నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని రైతులు మంగళవారం ముట్టడించారు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులను నెట్టుకుంటూ వారంతా కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. ఇరిగేషన్ డీఈ కార్యాలయం వద్ద రైతులంతా బైఠాయించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. కాలువల ఆధునీకరణ పనుల పేరుతో నీటిని ఆపేసి పనులు చేయిస్తున్న అధికారుల వైఖరిని ఈ సందర్భంగా వారు నిలదీశారు. కాంట్రాక్టర్‌కు సహకరించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇరిగేషన్ డీఈ తక్షణమే తమ వద్దకు వచ్చి సమాధానం చెప్పాలంటూ నిరసన వ్యక్తం చేశారు. దాంతో డీఈ కార్యాలయానికి తాళం వేసేందుకు వారంతా సిద్ధమయ్యారు. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

# ప్రజారోగ్య పథకాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలి

**ఆరోగ్య శాఖ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో మేడ్చల్ జిల్లా డీఎంహెచ్ఓ కె.ఆనంద్**





**మేడ్చల్ :** జిల్లాలో అమలు జరుగుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్: కె. ఆనంద్ మెడికల్ అధికారులను ఆదేశించారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్: కె. ఆనంద్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీ.ఎం అండ్ హెచ్.ఓ మాట్లాడుతూ, వర్షాకాలం సీజన్ లో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా, ఫీవర్ సర్వేలు, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి చికిత్స అందించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంలో టిబి నోటిఫికేషన్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అమలు, రోగుల గుర్తింపు వారి ఫాలోఅప్‌ను మరింత మెరుగుపరచాలన్నారు. మాతా శిశు ఆరోగ్య కార్యక్రమం కింద పోర్టల్‌లో సమాచార నమోదును సకాలంలో పూర్తి చేయడంతో పాటు గర్భిణీల నమోదు పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల పర్యవేక్షణను బలోపేతం చేయాలని, అక్యూట్ ఫ్లాసిడ్ ప్యారాలిసిస్ మీజిల్స్–రుబెల్లా కేసులను తప్పనిసరిగా నోటిఫై చేయాలన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వైద్యాధికారులు తప్పనిసరిగా పాఠశాలల పేరెంట్స్–టీచర్స్ సమావేశాలకు హాజరై వ్యాక్సిన్‌పై ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని డాక్టర్: ఆనంద్ సూచించారు. అలాగే, జిల్లాలోని అర్హులైన పిల్లలందరి వివరాలను యూవిన్ పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని కోరారు. అసంక్రమ వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా రక్తపోటు మధుమేహం కేసుల గుర్తింపును పెంచడంతో పాటు పోర్టల్ నమోదులను పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలపాలని డా. కె. ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కీసర, మల్కాజ్గిరి ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు డా: గీత, డా: లావణ్య రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, డా: నాగరాజ్ , డా: గీత, డా: చంద్రకళ, డా: పవన్ కుమార్ రెడ్డి , డా: కౌశిక్, జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత రిపోర్టింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి లులూ మాల్‌లో భద్రతా లోపం

### లైసెన్స్ రివాల్వర్‌తో లోపలికి ప్రవేశించిన ఓ వ్యక్తి






**కూకట్‌పల్లి, జులై 14, (జనం వార్త ):** కెపిహెచ్ బి కాలనీ లులూ మాల్ లోకి ఓ వ్యక్తి లైసెన్స్ రివాల్వర్ తో ప్రవేశించిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాతబస్తీకి చెందిన సిద్ధికి అనే వ్యక్తి గచ్చిబౌలిలోని ఓ రివాల్వర్ ఫైరింగ్ అకాడమీలో షూటింగ్ శిక్షణ పొందుతున్నాడు. సోమవారం రాత్రి అతని సన్నిహితులు కొందరు కూకట్ పల్లి లులూ మాల్ లో షాపింగ్ చేస్తున్నారని, వారికి కొంత డబ్బు అవసరం ఉందని తెలిసి ఇవ్వడానికి లులూ మాల్ లోకి ప్రవేశించాడు. లులూ మాల్ లోకి ప్రవేశిస్తున్న సమయంలో సిద్ధికి వద్ద తన లైసెన్సు రివాల్వర్ ఉంది. ఆ సమయంలో భద్రతా సిబ్బంది అతని వద్ద గల రివాల్వర్ ను గుర్తించలేదు. మాల్ నుండి బయటకు తిరిగి వస్తున్న సమయంలో భద్రతా సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కెపిహెచ్ బి పోలీసులు సిద్ధికి వద్ద గల రివాల్వర్ ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద గల రివాల్వర్ కు లైసెన్స్ ఉన్నట్లు గుర్తించారు. లులూ మాల్ లోకి రివాల్వర్ తీసుకొని వెళ్లే సమయంలో భద్రతా సిబ్బంది లోపం ఉన్నట్టు పోలీసులు గుర్తించి యాజమాన్యంపై కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తుంది.



## కుషాయిగూడ పోలీసులకు అవార్డులు

### లోక్ అదాలత్ నిర్వహణలో విశిష్ట సేవలకు పోలీసు సిబ్బందికి గుర్తింపు

**ఉప్పల్ :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో లోక్ అదాలత్ నిర్వహణలో మెరుగైన ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉప్పల్ డీసీపీ కె. సురేష్ కుమార్ అవార్డులతో సత్కరించారు. లోక్ అదాలత్‌లో విశిష్ట సేవలు అందించిన ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, ఏఎస్ఐ కె. నర్సింగరావు, పీసీ డి. సంతోష్ రెడ్డి, పీసీ డి. అశోక్‌లకు డీసీపీ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. అదేవిధంగా 14 ద్విచక్ర వాహనాల రికవరీ కేసును విజయవంతంగా ఛేదించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం. విజయ్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ పి. యాదగిరి, పీసీలు ఎస్. శ్రీనివాస్, కె. దినేష్, సీహెచ్. మహేష్, మహిళా కానిస్టేబుల్ సౌమ్యలకు కూడా ప్రశంసాపత్రాలు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీసీపీ కె. సురేష్ కుమార్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే అధికారులు, సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఉత్సాహం పెరుగుతుందని పేర్కొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య అందివ్వాలి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య
- రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు వినతి పత్రం అందజేసిన టీడబ్ల్యూజేఎఫ్

**హైదరాబాద్ :** తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడు తూ.. వివిధ పత్రికలు, చానళ్లల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదించుకోలేక పోతున్నారని అన్నారు. జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు సీట్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇవ్వాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.

### జర్నలిస్టుల పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక కోటా

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించే విషయాన్ని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను ఇస్తున్నట్లయితే దాని వివరాలు ఇవ్వాలని ఆమె ఫెడరేషన్ ప్రతినిధులను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా నడుస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద సీట్లు ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచెం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్ తదితరులున్నారు.

## వైసిపి నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

### చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి

**కాకినాడ, జూలై 14 :** వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి(73) మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. కిడ్నీ సమస్యలతో గత నెల 16న హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చేరారు. అప్పటి నుంచి అక్కడ ముద్రగడకి చికిత్స జరుగుతోంది. అయితే సాయంత్రం పరిస్థితి విషమించడంతో ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రాణాలు కోల్పోయారు. ముద్రగడ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి. 1953 జనవరి 22న ఆయన జన్మించారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన జీవిత కాలంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగానూ ఆయన పని చేశారు. ముఖ్యంగా కాపు ఉద్యమ నేతగా ఆయనకు మంచి గుర్తింపు లభించింది. తండ్రి మరణానంతరం 1977లో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనతా పార్టీ తరఫున ప్రత్తిపాడు నుంచి విజయం సాధించారు. 1982లో తెదేపాలో చేరిన ముద్రగడ.. 1983, 1985, 1989 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ఆ పదవితో పాటు తెదేపాకు రాజీనామా చేశారు. ప్రజారక్షణ సమితి, తెలుగునాడు పార్టీలను ముద్రగడ పద్మనాభం స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా గెలుపొందారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ఆయన.. ఆ సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం దీక్ష చేశారు. 2016లో తునిలో కాపు ఐక్య గర్జన సభ నిర్వహించారు.

## విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత
- మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన గోగుల సరిత, తుంగతుర్తి రవి





**మేడిపల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య పెద్దపీట వేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీ.ఎస్.సీ.పీ.సీ.ఆర్) సభ్యురాలు గోగుల సరిత అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9వ డివిజన్ మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పార్టీ నాయకులు కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించిన గోగుల సరిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యత, పరిశుభ్రత, పాఠశాల వసతులపై ఆరా తీశారు. అలాగే, పాఠశాలలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులుసత్య ప్రసాద్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం, మహ్మద్ మజర్, ప్రణయ్, బర్రె నాగరాజు, సోమయ్య, కాటపాక కుమార్, సునీల్, జయందర్, పంగ రాజు, శరత్ గౌడ్, సాయిరాం గౌడ్, భరత్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

- క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం
- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు
- అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు
- 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు
- ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి, జూలై 14 :** ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా, అగ్ని మాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

### మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారథి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## వియత్నాం నుంచి ముగ్గురి డెడ్ బాడీల రాక

- శంషాబాద్‌లో ప్రత్యే అంబులెన్స్‌ల ద్వారా తరలింపు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి, జూలై 14 :** వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురి మృతదేహాలు మంగళవారం ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్‌కు చేరుకున్నాయి. మృతుల్లో కడప జిల్లాకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ఉన్నారు. మృతదేహాలను భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన అన్ని చట్టపరమైన ప్రక్రియలను ముంబైలో పూర్తి చేసిన తర్వాత కుటుంబసభ్యులకు అధికారులు నేరుగా అప్పగించారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులకు, సన్నిహితులకు ధైర్యం చెప్పారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి కడప, మచిలీపట్నం, హిందూపురం ప్రాంతాలకు మృతదేహాలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సదుపాయం కల్పించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

## జగన్ ఇకనైనా శవరాజకీయాలు మానుకోవాలి

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు**

**విశాఖపట్నం, జూలై 14 :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. విశాఖ పర్యటనపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికైనా గొడ్డలి పార్టీ అధ్యక్షుడు శవ రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. నేడు జగన్ రెడ్డి.. విశాఖపట్నానికి ఎందుకు వస్తున్నారో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఒక్క మత్స్యకారుడికి కూడా న్యాయం చేయలేదని విమర్శించారు. వారికి చట్ట ప్రకారం చెల్లించాల్సిన బకాయిలను చెల్లించలేదన్నారు. అసలు మత్స్యకారులకు జగన్ రెడ్డి ఏం చేశారో సమాధానం చెప్పాలని పల్లా అన్నారు. మత్స్యకార నిధులను కూడా జగన్ డైవర్ట్ చేశారని ఆరోపించారు. ఇప్పుడు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి ప్రమాద ఘటన గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ మత్స్యకారులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జగన్ రాజకీయాలు చేయడం కోసమే విశాఖకు వస్తున్నారని పల్లా శ్రీనివాస రావు వ్యాఖ్యానించారు.



## చైనాను వణికిస్తున్న టైఫూన్ బావి

**వరదనీటిలో కార్లు కొట్టుకుపోయిన దృశ్యాలు**

**బీజింగ్, జూలై 14 :** చైనాను టైఫూన్ బావి వణికిస్తోంది. భారీ వర్షాలతో.. రహదారులు జలమయంగా మారాయి. లియావోనింగ్ ప్రావిన్స్‌లోని 2,60,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదనీటిలో కార్లు బొమ్మల్లా కొట్టుకుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మంగళవారం కూడా భారీ వర్షాలకు అవకాశం ఉందని చైనా జాతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. 13 రోజుల క్రితం పసిఫిక్ సముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్ ఫ్రాన్స్ దేశమంతా విస్తీర్ణాన్ని కలిగి ఉంది. దీని ప్రభావం జపాన్, తైవాన్, ఫిలిప్పీన్స్, ఉత్తర కొరియాలోనూ కనిపిస్తోంది.

## విఎస్ఎస్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**జిల్లా అటవీ శాఖాధికారికి వినతిపత్రం సమర్పణ**

**ఏలూరు, జులై 14 :** ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో ఉన్న వన సంరక్షణ సమితుల (వి ఎస్ ఎస్) అభివృద్ధికి అటవి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బి కే యం యు ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల గురవయ్య బండి వెంకటేశ్వరరావు ఏలూరు జిల్లా అటవి శాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఏలూరు డి.ఎఫ్.ఓ ని సిపిఐ బికేఎంయు నాయకులు కలిసి విఎస్ఎస్ ల సమస్యలను, వి ఎస్ ఎస్ లలో సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. చింతలపూడి మండలం పాత చింతలపూడిలో విఎస్ఎస్ అభివృద్ధికి నేరేడు సీతాఫల మొక్కలతోపాటు ఎదురు పెంపకానికి అవకాశం కల్పించాలని వారు డి ఎఫ్ ఓ ని కోరారు. కొమ్ముగూడెం వి ఎస్ ఎస్ లో మరి కొంతమంది కొత్త సభ్యులను చేర్పించుకొని విఎస్ఎస్ అన్ని అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కమలాపురం వి ఎస్ ఎస్ కు దగ్గర్లో ఉన్న గ్రామాల్లోని పేదలను ఆ వి ఎస్ ఎస్ లో కలిపి వి ఎస్ ఎస్ కు మరికొంత అడవి బంజరును కేటాయించి పేద ప్రజలను ఆదుకోవాలని వారు డిఎఫ్ఓ ను కోరారు. రేచర్ల వి ఎస్ ఎస్ కు సంబంధించి జామాయిల్ కటింగ్ అయ్యి సంవత్సరం అయిన ఇంతవరకు విఎస్ఎస్ సభ్యులకు కట్టింగ్ అయిన జామ్ ఆయిల్ డబ్బులు పడలేదని, వాటిని చెల్లించేందుకు డి ఎఫ్ ఓ తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక వి ఎస్ ఎస్ లు అభివృద్ధికి నోసుకోక, పూర్తిస్థాయి సభ్యులు లేక, వి ఎస్ ఎస్ కమిటీలు సక్రమంగా పనిచేయక, అటవీ శాఖ నుండి విఎస్ఎస్ ల కు సరైన ప్రోత్సాహం లేక కుంటుపడ్డాయని వారు డిఎఫ్ఓకి తెలిపారు.

## డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

**మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి, జూలై 14 :** డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్ఓడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు. 'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నానను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

## ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

- పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి
- త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష



**అమరావతి, జులై 14 :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదు-పాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు..



## పల్నాడు జిల్లాలో విషాద ఘటన

**పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య**

**పల్నాడు, జూలై 14 :** పల్నాడు జిల్లాలోని వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను హత్య చేసి, తానూ ఆత్మహకు పాల్పడింది. తల్లి నక్క భారతి(28) తన ఇద్దరు కుమారులు హేమంత్ రెడ్డి(5), తేజ(3)ను హత్య చేసిన అనంతరం తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోగా, కుటుంబ సభ్యుల రోదనలు హృదయాలను కలిచివేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్లే ఈ ఘటన జరిగిందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం పోలీసులు అన్ని ఆధారాలను పరిశీలిస్తూ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఇంద్రకీలాద్రిపై పెరిగిన రద్దీ

**అమ్మవారి దర్శనానికి పెరిగిన భక్తుల రాక**

**విజయవాడ, జూలై 14 :** ఆషాడం మొదలు కానుండడంతో బెజవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమావాస్య మంగళవారం కూడా మంచిదన్న భావనతో అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలి రావడంతో భక్తజన సందోహంతో కళకళలాడింది. తెల్లవారు ఝాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికై తరలి వచ్చారు. అమ్మవారి ప్రసాదాలను కూడా భక్తులు పెద్ద ఎత్తుననే స్వీకరించారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, భద్రత, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆషాఢ మాసంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం, ప్రసాద సేవ, అన్నదానం, తలనీలాల సమ-ర్పణతో ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంతో కళకళలాడింది. భక్తులందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తూ ఆలయం నుంచి ఆనందంగా తిరుగు ప్రయాణం అయ్యారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి

**కర్నూలులో హైవేపై జాగింగ్ చేస్తుండగా దుర్ఘటన**

**కర్నూలు, జూలై 14 :** జిల్లాలోని బళ్లారి చౌరస్తాలో రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఏపీఎస్పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ వర ప్రసాద్ రెడ్డి(43) అక్కడికక్కడే మృతి చెందారు. మంగళవారం ఉదయం హైవేపై జాగింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. వాహనం ఢీకొట్టడంతో హెడ్ కానిస్టేబుల్.. వంతెన పైనుంచి కిందపడిపోయి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ వర ప్రసాద్ రెడ్డి మృతి చెందడంపై హోం మంత్రి అనిత స్పందించారు. హెడ్ కానిస్టేబుల్ మృతి తీవ్ర విచారకరమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందించిన ఒక పోలీసు సిబ్బందిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలిచి, అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి గల కారణాలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర ప్రసాద్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# చమురు మంటల్లో కరుగుతోన్న సూచీల లాభం..



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా మార్కెట్లు ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ప్రారంభయ్యాయి. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలతో చమురు మంటలు భగ్గుమంటున్నాయి. దాంతో సూచీలపై ప్రతికూల ప్రభావం పడింది. హర్మూజ్‌ను దిగ్బంధిస్తున్నాం.. టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. నెలరోజుల గరిష్ఠానికి చేరాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు రెండు శాతం పెరిగి 85 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ రెండు శాతం పెరిగి 80 డాలర్లకు పెరిగింది. గత సెషన్‌లో 9.6 శాతం పెరిగింది. 2020 మే తర్వాత ఒకేరోజు ఈ స్థాయి పెరుగుదల నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఉదయం 9.39 గంటల సమయంలో సెన్సెక్స్ 412 పాయింట్లు పడిపోయి, 77,203 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 107 పాయింట్లు నష్టపోయి, 24,103 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 42 పైసలు పడిపోయి, 96.10కి కుంగింది. నిఫ్టీ సూచీలో హిందాల్కో, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్, నెస్లే, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉండగా.. శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఅండ్‌ఎం షేర్లు నష్టపోతున్నాయి. ఇక, సోమవారం అమెరికా మార్కెట్లు నష్టపోగా.. ఆసియా మార్కెట్లు అదే బాటలో ఉన్నాయి.






## చమురు ధరలకు రెక్కలు..

### సూచీల నేల చూపులు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా మళ్లీ క్రూడాయిల్ ధరలు పెరగడం, వడ్డీ రేట్లు పెరుగుతాయన్న భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాల నడుమ మన మార్కెట్ సూచీలూ నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. దీంతో బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్ల మేర ఆవిరైంది. సెన్సెక్స్ ఉదయం 77,272.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,616.40) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా నష్టంతో 77,001.48 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 561.46 పాయింట్ల నష్టంతో 77,054.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 158.95 పాయింట్ల నష్టంతో 24,052.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, టీసీఎస్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. ఇరాన్– అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర రూపం దాల్చడం స్టాక్‌మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఇరు దేశాల మధ్య మళ్లీ అగ్గి రాజుకోవడంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు విఘాతం కలుగుతుందన్న భయాలు నెలకొన్నాయి. దీంతో చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఏకంగా 87 డాలర్ల స్థాయికి చేరడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతీసింది. అటు అమెరికా, ఇటు భారత్‌లోనూ ద్రవ్యోల్బణం కారణంగా వడ్డీ రేట్లు పెరగొచ్చన్న అంచనాలూ సూచీలను పడేశాయి. దీనికితోడు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిరాశజనక ఫలితాలు వెలువరించడం, డాలరుతో రూపాయి మారకం విలువ 96 డాలర్ల స్థాయికి చేరడం ప్రతికూల ప్రభావం చూపింది.





# భారత్‌దే తొలి వన్డే

## యూకే పర్యటనలో తొలి విజయం

**బర్మింగ్‌హామ్:** యూకే పర్యటనలో టీమిండియా తొలి విజయాన్ని నమోదు చేసింది. ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి వన్డేలో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 259 పరుగుల లక్ష్యాన్ని 45.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (80; రిటైర్డ్ హర్ట్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. అక్షర్ పటేల్ (57, 4 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. చివర్లో సిక్స్ బాది వాషింగ్టన్ సుందర్ (52) సైతం హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (35) పరుగులు చేశాడు. రోహిత్ శర్మ (11), విరాట్ కోహ్లీ (5), కేఎల్ రాహుల్ (1) నిరాశపర్చారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, సామ్ కరన్ తలో వికెట్ తీశారు. 259 పరుగుల లక్ష్యఛేదనలో బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన కెప్టెన్ గిల్.. అవకాశం చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదాడు. 51 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. రోహిత్, కోహ్లీ తక్కువ పరుగులకే వెనుదిరిగినప్పటికీ.. శ్రేయస్ అయ్యర్‌తో కలిసి గిల్ 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయింతే, కాలి కండరాలు పట్టేయడంతో 80 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అనంతరం స్వల్ప వ్యవధిలోనే శ్రేయస్, కేఎల్ రాహుల్ ఔటయ్యారు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ కలిసి ఒక్కో రన్‌ను జత చేస్తూ.. 102 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలిచింది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (76బి), లియామ్ డాసున్ (68) అర్ధశతకాలు చేశారు. బెన్ డకెట్ (43) ఫర్వాలేదనిపించగా.. జాకబ్ బెతెల్ (14), విల్ జాక్స్ (20బి), ఆర్చర్ (12) రెండంకెల స్కోరు చేశారు. హ్యారీ బ్రూక్ (1), జోస్ బట్లర్ (5), సామ్ కరన్ (0) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4, గుర్నూర్ బ్రార్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, బుమ్రా, దూబే చెరో వికెట్ తీశారు. 41 నుంచి 50 ఓవర్ల మధ్యలో నాలుగు వికెట్లు తీసిన రెండో భారత స్పిన్నర్ అక్షర్ పటేల్. అంతకుముందు రవీంద్ర జడేజా శ్రీలంకపై 2013లో ఈ ఫీట్ చేశాడు. ఇదిలా ఉండగా.. యూకే పర్యటనలో ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌ల్లో భారత్ ఓడిపోయిన విషయం తెలిసిందే.



## చరిత్ర సృష్టించిన జస్‌ప్రీత్ బుమ్రా



భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అద్భుత ఘనత సాధించాడు. ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను బుమ్రా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో వన్డేల్లో 150వ వికెట్‌ను తీసిన బౌలర్‌గా నిలిచాడు. అదే సమయంలో ఇంగ్లాండ్ గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ రికార్డు నమోదు చేశాడు. బుమ్రా 150 వికెట్లు తీయడానికి 4,605 బంతులు తీసుకున్నాడు. ఈ జాబితాలో షమీ (4,070), కుల్‌దీప్ యాదవ్ (4,513) ముందువరుసలో ఉన్నారు. ఈ క్రమంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ (5,027)ను బుమ్రా అధిగమించాడు. ఇంగ్లాండ్ గడ్డపై బుమ్రా ఇప్పటి వరకు 31 వికెట్లు తీశాడు. దీంతో రవీంద్ర జడేజా (30), భువనేశ్వర్ కుమార్ (28), మదన్ లాల్ (27)ను బుమ్రా వెనక్కి నెట్టాడు. మూడు ఫార్మాట్లలోనూ 100 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన భారత బౌలర్‌గా ఇప్పటికే అతడు ఘనత సాధించాడు. వన్డేల్లో 150, టెస్టుల్లో 234 వికెట్లు, టీ20ల్లో 121 వికెట్లను బుమ్రా పడగొట్టాడు

## యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో

# భారత క్లబ్‌లు అద్భుత ప్రదర్శన

### పంజాబ్ ఎఫ్‌సీకి 5-0 భారీ విజయం




జపాన్‌లో జరుగుతున్న యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌లలో భారత అభివృద్ధి జట్లు (డెవలప్‌మెంట్ స్క్వాడ్స్) ఆకట్టుకునే ప్రదర్శన కనబర్చాయి. జూలై 14, 2027న కురాటే (జపాన్) వేదికగా జరిగిన పోటీల్లో భారత క్లబ్‌లు జపాన్ జే–లీగ్‌కు చెందిన జట్లతో తలపడగా, రెండు జట్లు విజయాలు నమోదు చేయగా, మరో జట్టు తృటిలో ఓటమి చవిచూసింది. రోజంతా జరిగిన మ్యాచ్‌ల్లో అత్యంత ఏకపక్ష విజయాన్ని పంజాబ్ ఎఫ్‌సీ నమోదు చేసింది. అవిస్పా ఫుకుఓకాపై 5–0 తేడాతో ఘన విజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మ్యాచ్ ప్రారంభమైన మూడు నిమిషాల్లోనే సింగమయుమ్ షామి తొలి గోల్ నమోదు చేయగా, 28వ నిమిషంలో మరోసారి గోల్ చేసి జట్టుకు బలమైన ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 42వ నిమిషంలో ఒమాంగ్ డోడుమ్ మరో గోల్ సాధించాడు. రెండో అర్ధభాగంలో 55వ నిమిషంలో నగారిన్ షైజా స్కోరు పెంచగా, ఇంజరీ టైమ్ (90ం2)లో విశాల్ యాదవ్ ఐదో గోల్ చేసి పంజాబ్ ఎఫ్‌సీ విజయాన్ని మరింత ఘనంగా నిలిపాడు. మరో ఆసక్తికర మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 3–2 తేడాతో గిరావాంజ్ కిటాక్యూషుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 40వ నిమిషంలో ర్యునోసుకే ఇమై గోల్ చేయడంతో జపాన్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో బెంగళూరు ఎఫ్‌సీ అద్భుతంగా పుంజుకుంది. 61వ నిమిషంలో రక్షిత్ రక్షిత్ ప్రియా అనిల్ సమం చేసే గోల్ నమోదు చేశాడు. ఒక స్వీయ గోల్ కారణంగా మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారినప్పటికీ, 75వ నిమిషంలో సెర్టో వోర్నిలెన్ కోమ్ కీలక గోల్ సాధించాడు. చివరి నిమిషాల్లో జట్టు సమిష్టి రక్షణ ఆకట్టుకోగా, 90వ నిమిషంలో ఎండీ అర్బాష్ గోల్ చేసినప్పటికీ బెంగళూరు ఎఫ్‌సీ విజయాన్ని కాపాడుకుంది. మరో మ్యాచ్‌లో ఎఫ్‌సీ గోవా జపాన్‌కు చెందిన సాగన్ టోసుతో హోరాహోరీగా పోరాడినా 1–0 తేడాతో ఓటమి పాలైంది.




## క్రెడిట్‌కార్డుతో ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపులు కుదరవ్

ప్రముఖ ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ క్రెడిట్‌కార్డుతో ప్రీమియం చెల్లింపులను నిలిపివేసింది. తన అధికారిక కస్టమర్ పోర్టల్, యాప్‌లో క్రెడిట్ కార్డ్ ద్వారా ప్రీమియం చెల్లించే ఆప్షన్‌ను తొలగించింది. 15 రోజుల క్రితమే ఈ ఆప్షన్‌ను తీసేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎల్ఐసీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌లో కేవలం నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, యూపీఐ ఆప్షన్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఎల్ఐసీ పాలసీ ప్రీమియంలను ఇతర ప్లాట్‌ఫామ్‌ల ద్వారా క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించేటప్పుడు రుసుములు పడేవి. అదే ఎల్ఐసీ పోర్టల్/యాప్‌లో క్రెడిట్‌కార్డు ద్వారా చెల్లించినప్పుడు గేట్‌వే ఛార్జీలను/కన్వీనియన్స్ ఫీజులను కస్టమర్లు తరఫున ఎల్ఐసీనే భరించేది. రానురాను లావాదేవీల సంఖ్య పెరుగుతుండడం, ఫీజుల భారం అధికం అవుతుండడంతో క్రెడిట్‌కార్డ్ ఆప్షన్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ క్రెడిట్‌కార్డు ఉపయోగించి బిల్లు పేమెంట్ చేయాలంటే భారత్ బిల్ పేమెంట్‌పే, దాంతో అనుసంధానమైన బిల్లు పేమెంట్ ఆప్షన్లను వినియోగించుకోవచ్చని ఎల్ఐసీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అంటే గూగుల్ పే, ఫోన్‌పే, అమెజాన్ పే వంటి యాప్స్ ద్వారా ప్రీమియం చెల్లింపులకు క్రెడిట్ కార్డ్ పేమెంట్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. అయితే, ఆయా ప్లాట్‌ఫామ్స్‌లో రుసుముల భారాన్ని వినియోగదారులే భరించాలి. ఒకవేళ ఎలాంటి రుసుములూ లేకుండా ఉచితంగా ప్రీమియం చెల్లించాలనుకుంటే ఎల్ఐసీ అధికారిక పోర్టల్‌లో, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ మార్గాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. యాక్సిస్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ వంటి కో బ్రాండెడ్ క్రెడిట్‌కార్డులకూ ఈ నిబంధన వర్తిస్తుంది. ఇతర ప్లాట్‌ఫామ్‌లపై ప్రీమియం చెల్లించినప్పటికీ రివార్డు పాయింట్లు మాత్రం లభిస్తాయి. దీంతో ఇక కోబ్రాండ్ క్రెడిట్ కార్డులతో ప్రయోజనమేంటని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.



## అమెరికా, యూరప్ మార్కెట్లకు వన్‌ప్లస్ గుడ్‌బై

ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ మరోసారి వార్తల్లో నిలిచింది. అమెరికా, యూరోపియన్ మార్కెట్లకు ఈ కంపెనీ స్వస్తి పలికేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అక్కడ కార్యకలాపాలను నిలిపివేయబోతోందని జర్మనీకి చెందిన విన్‌ఫ్యూచర్ నివేదిక పేర్కొంది. వారం రోజుల్లో దీనిపై కంపెనీ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే వన్‌ప్లస్ ఫోన్లు వాడుతున్న యూరప్, అమెరికా వినియోగదారులకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, సేవల పరంగా ఎలాంటి ఇబ్బందులూ ఉండవని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇచ్చిన కాలపరిమితి వరకు సేవలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం స్టాక్ అయిపోయాక ఎలాంటి కొత్త ఫోన్లను లాంచ్ చేయబోదని తెలుస్తోంది. అదే సమయంలో భారత్, చైనా వంటి ఇతర మార్కెట్లలో మాత్రం తన కార్యకలపాలను యథావిధిగా కొనసాగిస్తుందని సమాచారం. భారత్‌లో వన్‌ప్లస్ బ్రాండ్‌కు మంచి ఆదరణ ఉంది. దీంతో దేశీయంగా సేవలు కొనసాగేందుకు అవకాశం ఉంది. ఒప్పో సబ్‌బ్రాండ్‌గా తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లను విడుదల చేసే అవకాశం ఉంది. గతంలోనూ పశ్చిమాసియా మార్కెట్ల నుంచి వన్‌ప్లస్ వైదొలుగుతున్నట్లు ప్రచారం జరగ్గా.. కంపెనీ తోసిపుచ్చింది. మరోవైపు, ర్యామ్, చిప్‌ల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వన్‌ప్లస్ తన ప్యాడ్ ధరలను పెంచింది. వన్‌ప్లస్ ప్యాడ్ గో 2, ప్యాడ్ లైట్ ధరలను రూ.1000 నుంచి రూ.2 వేల వరకు సవరించింది.




## వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్

రాజేందప్రసాద్, శ్రీకాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్' . జి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో వేంకటేశ్వర స్వామిగా రాజేందప్రసాద్ నటించగా.. భక్తుడిగా శ్రీకాంత్ కనిపించనున్నారు.

## తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

### జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా



విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం. సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

### సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్



అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.





## తుంబాడ్-2లో ఆలియా భట్

భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బ్జడెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## జపాన్‌లో తేలిపోయిన దురంధర్




బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురందర్' ప్రపంచవ్యాప్తంగా మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ, జపాన్ బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన ఆరంభాన్ని నమోదు చేయలేక పోయింది. ఈ ఫ్రాంచైజీకి ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ లభించగా, రెండు భాగాలు కలిపి రూ.3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి రికార్డులు సృష్టించాయి. అయితే జపాన్ మార్కెట్‌లో మాత్రం ఈ సినిమా ప్రారంభ కలెక్షన్లు నిరాశ కలిగించాయి. జూలై 10న జపాన్‌లో సుమారు 80 స్క్రీన్‌లలో గ్రాండ్‌గా విడుదలైన 'ధురందర్'కు విడుదలకు ముందు భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. రణవీర్ సింగ్ అభిమానులతో పాటు భారతీయ సినీ ప్రేమికులు కూడా ఈ సినిమాపై మంచి అంచనాలు పెట్టుకున్నారు. కానీ ఆ అంచనాలకు తగ్గట్టుగా ప్రేక్షకాదరణ లభించలేదు. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, విడుదలైన తొలి రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు 57 థియేటర్లలో ఈ చిత్రాన్ని కేవలం 449 మంది ప్రేక్షకులు మాత్రమే వీక్షించారు. సాయంత్రం, రాత్రి షోలతో కలిపినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదు. మొత్తం తొలి రోజు 80 స్క్రీన్‌లలో కేవలం 900 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ కలెక్షన్లతో వారాంతంలో జపాన్ బాక్సాఫీస్ టాప్–25 చిత్రాల జాబితాలో కూడా 'ధురందర్' స్థానం సంపాదించలేకపోయిందని తెలుస్తోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇటీవల జపాన్‌లో విడుదలైన 'పుష్ప 2' కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఆ చిత్రం తొలి రోజు 886 టికెట్లు మాత్రమే విక్రయించగా, 'ధురందర్' 900 టికెట్లతో స్వల్పంగా మెరుగైన ఆరంభాన్ని నమోదు చేసింది. అయితే ఈ రెండు చిత్రాలు కూడా అక్కడ భారీ ఓపెనింగ్ సాధించలేకపోవడం విశేషం.

## బికినీ వేసుకోవడం అస్సలు ఇష్టం ఉండదు

### కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి చేసుకుని, ఒక బిడ్డకు తల్లి అయినప్పటికీ గ్లామర్ విషయంలో ఎక్కడా తగ్గడం లేదు. తన సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ చందమామ.. అటు సోషల్ మీడియాలో కూడా హాట్ ఫొటోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ నటించిన 'ది ఇండియా స్టోరీ' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. షూటింగ్ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 24న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇంటర్వ్యూలు ఇస్తున్న కాజల్.. తాజాగా ఒక ఆసక్తికరమైన ప్రశ్నపై ఎంతో ధైర్యంగా స్పందించారు. భవిష్యత్తులో బికినీ వేసుకునే పాత్రలు వస్తే నటిస్తారా? అనే ప్రశ్నకు కాజల్ అగర్వాల్ ఎవరూ ఊహించని విధంగా సమాధానమిచ్చారు. తనకు బికినీ వేసుకోవడం అస్సలు ఇష్టం ఉండదని, అలాగే హద్దులు దాటిన రొమాంటిక్ సీన్స్‌లో కూడా ఎట్టిపరిస్థితుల్లో నటించనని ఆమె ఖరాఖండిగా చెప్పారు. నటిగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి తనకంటూ కొన్ని హద్దులు, నియమాలు పెట్టుకున్నానని, వాటిని ఎప్పుడూ దాటబోనని స్పష్టం చేశారు. ఒకవేళ ఖచ్చితంగా బికినీ వేసుకోవాలని ఎవరైనా పట్టుబడితే.. అలాంటి అవకాశాలను చేతులారా వదులుకోవడానికైనా సిద్ధమే తప్ప తన పద్ధతిని మార్చుకోనని కాజల్ తేల్చి చెప్పారు. అది ఎంత భారీ బడ్జెట్ సినిమా అయినా, ఎంతటి పెద్ద స్టార్ ప్రాజెక్ట్ అయినా, చివరకు సినిమాలో అది ఎంత ముఖ్యమైన పాత్ర అయినా సరే.. తన పరిమితులకు లోబడి లేకపోతే నిర్మొహమాటంగా తిరస్కరిస్తానని వెల్లడించారు. నటన విషయంలో తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని, జీవితంలో వాటిని కచ్చితంగా పాటిస్తానని కాజల్ చెప్పిన మాటలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఒకప్పుడు గ్లామర్ డోస్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన కాజల్ ఇప్పుడిలా మాట్లాడటంతో అంతా ఆశ్చర్యపోతున్నారు.

## రావ్ బహద్దూర్ అందరూ చూడాల్సిన మూవీ

### ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా



ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉ ంది. వెంకటేశ్ మహా తక్కువ బ్జడెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com